

అనంతారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



అడ్మిషన్ల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

'మిడ్ డే మీల్' బంద్ !

అనంతారం ప్రభుత్వ పాఠశాలలో నిలిచిన మధ్యాహ్న భోజనం

ప్రభుత్వం చెల్లించే బిల్లు గిట్టుబాటు కావడం లేదని మానేసిన వంట మనిషి

శామీర్‌పేట్ : మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, అనంతారంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిపేశారు. 2024 విద్యా సంవత్సరం ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. నేటికి ఇంకా ఈ గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం కాలేదు. కారణమేమిటని ఆరా తీయగా.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలికి వేతనాలు సరిపోవడం లేదని చెబుతున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రభుత్వం అందించే ధరలకు వ్యత్యాసం ఉండి నష్టం వాటిల్లుతుందని నిర్వాహకురాలు రావడం లేదని ఉపాధ్యాయులు వివరణ ఇచ్చారు.

ఇంటి వద్దే ఉండాల్సి వస్తుంది...

విద్యార్థులు మధ్యాహ్న వేళల్లో ఇంటికి రావడంతో అన్ని పనులు వదులుకుని ఇంటి వద్దే ఉండాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని మా కుటుంబ పరిస్థితికి కూలీపని చేస్తేనే పూట గడిచేది. అలాంటిది తమ పిల్లలు మధ్యాహ్న భోజనానికి ఇంటికి రావడంతో కూలీ, వ్యవసాయ పనులను వదులుకుని ఇంటివద్దే ఉండాల్సి వస్తుందంటున్నారు. మధ్యాహ్న సమయంలో పిల్లలు రోడ్డు దాటి ఇంటికి చేరుకోవాలని, దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

26న మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య, పోలీస్ సిబ్బంది

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కీసర : మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఈనెల 26 నిర్వహిస్తున్న సందర్భంగా కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవారం నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ×మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన₹ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్ సేవించడం వల్ల ఆరోగ్యం, సమాజంపై జరిగే పరిణామాలను పంచుకున్నారు. పాఠశాల పిల్లలకు ఎన్‌డీపీఎస్ యాక్ట్ చట్టపరమైన నిబంధనలు, శిక్షలపై అవగహన కల్పించారు. ఎస్సై నాగరాజు, పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ తదితరులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాగౌడ్ అన్నారు. మంగళవారం కౌన్సిల్ సమావేశంలోఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో మంత్రి శ్రీధర్‌బాబు మంజూరు చేసిన రూ 45 లక్షలు, ఎమ్మెల్సీ నిధులు రూ.50 లక్షలతో సీసీరోడ్లు, ఏర్పాటు చేయడంతో పాటు, మున్సిపల్ నిధుల నుంచి ఓపెన్‌జిమ్, నాలాల శుభ్రత కోసం మరో రూ.10 లక్షల మున్సిపల్ నిధులు, మురికి కాలువల మరమ్మతు పనులు, పారిశుద్ధ్య సామగ్రి కొనుగోళ్ల కోసం రూ.5 లక్షలు తాగునీటి సరఫరా పైపులైన్ల మరమ్మత్తు కోసం రూ.10 లక్షలు, శ్మశానవాటిక అభివృద్ధి కోసం రూ. 60 లక్షలు, వాకింగ్ ట్రాక్ కోసం రూ.10 లక్షలు తదితర అభివృద్ధి పనుల కోసం కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానించడం జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ నిధులతో కొనుగోళ్లు చేసిన జేసీబీని ఆమె ప్రారంభించారు. వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, టీపీఓ శ్రీధర్, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి మారలే.!

12 వేల దరఖాస్తులకు 9,067 పెండింగ్

21 ప్రత్యేక బృందాల ఏర్పాటు

సాక్షి,మేడ్చల్ జిల్లా : భూ సంబంధిత సమస్యలపై ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో మార్పులు, చేర్పులు చేసినప్పటికీ, రెవెన్యూ శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్య ధోరణి తీవ్ర జాప్యంతో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం జరగడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజులకే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కలెక్టర్‌తో సహా రెవెన్యూ యంత్రాంగం అంతా ..అదే పనిలో నిమగ్నం కావలసిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి పత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నెలాఖరు వరకు పరిష్కరించేందుకు కసరత్తు చేస్తోంది.

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 9,067 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పైగా ప్రతి సోమవారం ప్రజావాణితో సహా మీసేవ కేంద్రాల నుంచి ధరణికి దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. బాధితులు పరిష్కారం కోసం కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ధరణి పోర్టల్ ప్రారంభించింది ఇక్కడే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనే ధరణి పోర్టల్‌ను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించింది. 2020 అక్టోబర్ 20 న మూడుచింతపల్లి మండల కేంద్రంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. పైసా లంచం చెల్లించకుండా భూసమస్యలు పరిష్కారమయ్యేలా.. పారదర్శకంగా పోర్టల్‌ను తీర్చిదిద్దామన్నా.. అదే పెద్ద సమస్యగా మారింది. ధరణి పోర్టల్‌తో భూసమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని భావిస్తే కొత్త సమస్యలు ఎదురుకావటంతో రైతులు, బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు.

◆ నూతన ప్రభుత్వం ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడంతో పాటు మార్పులు చేర్పులు చేసింది. దీంతో తమ భూ సమస్యలు పరిష్కారం కాగలవన్న ఆశలు రైతులు, బాధిత ప్రజల్లో చిగురించాయి. వందల సంఖ్యలో రెవెన్యూ ఆఫీసుల్లో దరఖాస్తులు పేరుకుపోవడంతో రైతులు, బాధిత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా..

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినా పరిష్కారానికి జాప్యం తప్పకపోవటంతో ఆవేదన చెందుతున్నారు. గతంలో జిల్లా అధికార యంత్రాంగం 21 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. గ్రామస్థాయిలో భూముల వివాద పరిష్కారాల్లో చురుగ్గా ఉండే వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు కావడం వల్ల క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన మండల ప్రత్యేక బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొన్ని తహసీల్దార్ కార్యాలయాలకు దరఖాస్తుల పరిశీలనలో జాప్యం నెలకొనగా... రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఎన్నికల ముందు కొంతమంది అధికారులు బదిలీ కావడంతో పరిస్థితి మొదటికొచ్చినట్లు తెలుస్తోంది.

సకాలంలో రికార్డులు దొరకక..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు మండలాల్లో వివాదంలో ఉన్న రెవెన్యూ, ఇతర భూములపై కూడా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించే క్రమంలో పాత రికార్డులను వెతకగా.. కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవి అందుబాటులో లేవని తెలుస్తోంది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలో నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొత్తగా ఏర్పడటంతో రికార్డుల నిర్వహణకు సంబంధించి కొంత అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల మాన్యువల్ పహాణీలు అందుబాటులో లేకపోవడంతో కూడా దరఖాస్తుల పరిష్కారంలో ఇక్కట్లు ఎదురౌతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం ద్వారా ఈ నెలాఖరు కల్లా పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారిస్తున్నట్లు సమాచారం.

ఆ రోడ్డును అభివృద్ధి చేయండి

- మేడ్చల్ నియోజకవర్గం 4 మండలాలను కలిపే రహదారి
- రోడ్డును విస్తరించకపోవడంతో ఇబ్బందిపడుతున్న ప్రజలు
- అభివృద్ధి చేసి దూరభారం తగ్గించాలని వినతి

మేడ్చల్: నియోజకవర్గంలో మేడ్చల్ నుంచి ఘట్‌కేసర్ వరకు కీసర, శామీర్‌పేట్‌ల మీదుగా వెళ్లే రోడ్డును అభివృద్ధి చేసి ఆధునీకరించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా వినబడుతున్నా.. పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మేడ్చల్ నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్డు రాజీవ్‌రహదారిని మజీద్‌పూర్ వద్ద కలుపుతూ.. దొంగల మైసమ్మ నుంచి కలెక్టరేట్, కీసర మీదుగా ఘట్‌కేసర్ వరంగల్ రహదారిని కలుపుతూ ఏళ్ల క్రితం నిర్మించారు.

◆ మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్ మండలాల్లోని గ్రామాలు ఈ రోడ్డులోనే ఉన్నాయి. పాత రోడ్డుకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో ఆ రోడ్డును అధికంగా ఉపయోగించడం లేదు.

◆ ఔటర్ రింగు రోడ్డు ఏర్పడటంతో ఘట్‌కేసర్ నుంచి మేడ్చల్‌కు రావాలన్నా, కీసర, శామీర్‌పేట్‌లకు వెళ్లాలన్నా.. కార్లు ఉన్నవారు రింగురోడ్డు మీదుగా ప్రయాణిస్తున్నారు. ద్విచక్రవాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నారు.

నియోజకవర్గాన్ని కలిపే ఏకైక రహదారి..

మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్, కీసర మండలాలను కలిపే ఎకైక రోడ్డు ఇది. మండలాలను కలపడంతో పాటు 44వ జాతీయ రహదారి, రాజీవ్‌రహదారి, వరంగల్ రహదారులను కలిపే లింకు రోడ్డు ఇదే కావడం గమనార్హం. మూడు రహదారులను, పదుల సంఖ్యలో గ్రామాలు, నాలుగు మండలాల కేంద్రాలను కలిపే రోడ్డైనా రద్దీ మాత్రం తక్కువగా ఉంది. రవాణా వాహనాలు, బస్సులు, ఇతర వాహనాల సంచారం తక్కువగా మారింది. దూరం పెరిగినా కార్లల్లో వెళ్లే వారు ఔటర్‌నే అధికంగా వినియోగిస్తున్నారు.



తిమ్మాయిపల్లి వద్ద మేడ్చల్ ఘట్‌కేసర్ లింకు రోడ్డు

అభివృద్ధి అవసరం..

కేవలం డబుల్ రోడ్డుగా ఉండటంతో ఈ రోడ్డులో ప్రయాణంపై శ్రద్ధ చూపడం లేదు. రాజబోల్లారం, అంతాయిపల్లి, తిమ్మాయిపల్లి, భోగారం, కొండాపూర్ కీసర వద్ద రోడ్డులో ప్రమాదకర మలుపులు ఉండటం, రోడ్డులో రెండు భారీ వాహనాలు వెళ్లేంత వీలుగా ఉండటం, డివైడర్లు, లైటింగ్స్ లేకపోవడంతో ఈ రోడ్డు ప్రయాణ దూరాన్ని తగ్గిస్తున్నా.. వాహనదారులు ఉపయోగించడం లేదు.

కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ఇబ్బందులే..

తూంకుంట మున్సిపాలిటీ పరిధి ఉప్పర్‌పల్లిలో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. లింకు రోడ్డుకు 500 మీటర్ల దూరంలో ఉన్న కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలంటే ఈ రోడ్డు ఒక్కటే దిక్కు.

◆ లింకు రోడ్డును పూర్తిగా అభివృద్ధి చేయడం వల్ల కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మేడ్చల్, కీసర, శామీర్‌పేట్, ఘట్‌కేసర్ మండలాల ప్రజలకు మార్గం సులువుగా మారుతుంది. ప్రజల రాకపోకలు పెరిగితే బస్సుల సంఖ్య పెరుగుతుంది.

రోడ్డును అభివృద్ధి చేయాలి..



మేడ్చల్ నియోజకవర్గంలోని నాలుగు మండల కేంద్రాలు, పలు గ్రామాలను కలిపే లింకు రోడ్డును అధికారులు అభివృద్ధి చేయాలి. రోడ్డు అభివృద్ధి చేస్తే నాలుగు మండలాల ప్రజలకు ఒక్కో మండలానికి సులువుగా వెళ్లొచ్చు. ఈ రోడ్డును అభివృద్ధి చేసే నాలుగు మండలాల ప్రజల కోసం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి.

– చిందం మహేందర్, దమ్మాయిగూడ

కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు అనువుగా..



కలెక్టర్ కార్యాలయం మీదుగా వెళ్లే రోడ్డుకు అన్ని హంగులు కలిపించి రోడ్డును అభివృద్ధి చేస్తే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా ఇబ్బందులు తొలుగుతాయి. రింగు రోడ్డు ఎక్కడం, దిగడం చేసే లోపే మండల కేంద్రం నుంచి కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవచ్చు. ప్రయాణ ఆర్థికభారం, ప్రయాణ దూరం తగ్గుతుంది.

– భానుచందర్, మేడ్చల్

మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ



మేడ్చల్ : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ మేడ్చల్ సీనియర్ నాయకుడు అత్తెల్లి సందీప్‌గౌడ్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు కలిశారు. బీఆర్‌ఎస్ అధినేతను కలవడం ఆనందంగా సందీప్ పేర్కొన్నారు.

పాత ఇళ్ల పరిశీలన



నివాసితులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్

కీసర: వర్షకాలం నేపథ్యంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలో నివాసానికి అనుకూలంగా లేని ఇళ్లను పరిశీలించి నివాసితులను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాల్లో నివసించేలా అవగహన కలిప్తున్నామని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పర్యటించిన ఆయన నివాస యోగ్యంగా లేనటువంటి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో భారీవర్షాల కారణంగా పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంటుందని, అలాంటి ఇళ్లను గుర్తించామన్నారు. ఆ ఇళ్లలో నివసిస్తున్న వారి వివరాలు సేకరించడంతో పాటు సురిక్షతంగా ఉన్న ఇళ్లలో నివసించేందుకు తగిన సూచనలు చేస్తున్నామన్నారు. మున్సిపల్ సిబ్బంది బాలమల్లేష్ తదితరులున్నారు.

ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఘట్‌కేసర్: డయాలసిస్ రోగికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం ఆర్థికసాయం చేశారు. వరంగల్‌జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన సోమయ్య రెండు కిడ్నీలు పాడై నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల విన్నపం మేరకు సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఎస్‌ఎఫ్‌సీనగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో బాధితుడి కుటుంబసభ్యులకు రూ.15 వేలు అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు వై.సుందర్‌రావు, సభ్యులు వీరారెడ్డి, రమేష్, సోమయ్య, ఐలయ్య, దేవేందర్, లింగస్వామి, బాబు, మల్లికార్జున్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

కూలీలకు బిల్లుల చెల్లింపు పై గ్రామసభలో చర్చ



కీసర గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

కీసర: మండల కేంద్రమైన కీసర, తిమ్మాయిపల్లి గ్రామంలో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంపై నిర్వహించిన గ్రామసభల్లో ఎంపీడీఓ గ్యామ, ఎంపీఓ నందకిషోర్‌లు పాల్గొన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపులు, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులు, కూలీలకు బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై గ్రామసభలో చర్చించారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ప్రజలు గ్రామసభల దృష్టికి తీసుకొచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్ గుప్తా, వివిధ పార్టీల నేతలు, గ్రామస్తులు, గ్రామకార్యదర్శులు గీత, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరం సమావేశం..

ఉపాధిహామీ పథకంలో భాగంగా 10 గ్రామాల్లో జరిగిన పనులపై మంగళవారం కీసర మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అధ్యక్షతన సోషల్ ఆడిట్, ఓపెన్ ఫోరం మీటింగ్ నిర్వహించారు. డీఆర్‌డీఓ సాంబశివరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటేష్, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, డీఆర్‌డీఓ అంబుడ్మెన్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ గ్యామ, ఎంపీటీసీ సభ్యులు నారాయణ, వెంకట్‌రెడ్డి, ఏపీఓ అర్పిత, డీఆర్పీ కాశన్న, టీఏ. జైపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఓపెన్‌ఫోరం సమావేశంలో ఎంపీపీ ఇందిరా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శామీర్‌పేట్ : ప్రైవేటు బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో వాహనదారుడికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామానికి తాడెం నగేష్ తన ద్విచక్ర వాహనంపై శామీర్‌పేట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో జగ్గంగూడ గ్రామ పరిధిలోని ఆల్కామెడ్ కంపెనీ మూలమలుపు వద్దకు రాగానే ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్ ద్విచక్రవాహనం ఢీ కొట్టాయి. ఈ ప్రమాదంలో నగేష్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్ హిల్స్‌లో వెలసిన శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మంత్ర హోమం, మన్యుసూక్త హోమాలను వేద మంత్రోచ్ఛరణాల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్టి పూజలను నిర్వహించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

తాగునీటి సరఫరా సమస్య పరిష్కారానికి కృషి



ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని రాజ్‌సుక్‌నగర్ కాలనీలోని తాగునీటి ట్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు సురక్షితమైన తాగునీటిని సకాలంలో ప్రజలకు అందించాలన్నారు. వర్షాకాలంలో తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు లేకుండా చూడాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామ

కీసర : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణీకు ప్రభుత్వం సరఫరా చేసే ఆహార పదార్థాలను సక్రమంగా అందజేయాలని ఎంపీడీఓ గ్యామ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సెంటర్‌కు హాజరవుతున్న చిన్నారుల వివరాలతో పాటు ఆహారపదార్థాల స్టాక్ రిజిస్ట్రార్‌లను పరిశీలించి అంగన్‌వాడీ టీచర్లకు విద్యాబోధనకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ సబిత కిషోర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బస్తీవాసులు తాగునీరు, త్రీ ఫేజ్ కరెంట్ సమస్యలను పరిష్కరించాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు మార్చి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెన్షన్, రేషన్ కార్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పించాలని బస్తీవాసులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ మోసీన్, సురేష్, పాచయ్య, తాజుద్దీన్, ఫరీద్, స్థానిక బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతంలో నీరు సరఫరాలో సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీరు తగిన ప్రెషర్‌తో రావడం లేదని, బోరు అందుబాటులో లేదని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. నీటి ప్రెషర్ పెంచడానికి నూతన జంక్షన్లు, పైపులైన్స్ వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించామన్నారు.